కమర్షియల్ షెట్టర్లపై అధికారులు స్పందించాలి

కాప్రా: ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో కాప్రా జీహెచ్ఎంసీ అధికారులు విఫలమయ్యారని, ఆరోపిస్తూ.. నిరసన చేస్తున్న సమాచార హక్కు సాధన సమితి జిల్లా కన్వీనర్ గగన్‌కుమార్‌ను పోలీసులు సోమవారం ప్రివెంట్ అరెస్ట్ చేశారు. అనంతరం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 6 నెలలుగా కాప్రా జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యానికి ప్రతినెల దాదాపు రూ.60 వేల ఆదాయం కోల్పోతుందన్నారు. దీనిపై అధికారులు స్పందించకుంటే ఇందిరాపార్కు వద్ద దీక్ష చేస్తానని హెచ్చరించారు. భారతీయ మౌన జాతుల ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రం, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్‌రెడ్డి, కార్పెంటర్ అసోసియేషన్ సభ్యులున్నారు.

జర్నలిస్టు అబ్దుల్ సత్తార్ కన్నుమూత



రామంతాపూర్: జర్నలిస్టు అబ్దుల్ సత్తార్ అనారోగ్యంతో రామంతాపూర్ ఇందిరానగర్ లోని ఆయన స్వగృహంలో సోమవారం కన్నుమూశారు. పలు అనారోగ్య సమస్యలతో ఆయన ఆసుపత్రిలో చేరారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి, రవికుమార్, జర్నలిస్టు సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు.

యూటర్న్ ఏర్పాటుకు తగిన చర్యలు



మల్లాపూర్: నాచారం రాఘవేంద్రనగర్, ఇందిరానగర్ కాలనీకి వెళ్లేవారి కోసం త్వరలో యూటర్న్ ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని నాచారం కార్పొరేటర్ శాంతి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును కోరారు. సోమవారం రాఘవేంద్రనగర్, ఇందిరానగర్‌కు వెళ్లే మూసివేసిన డివైడర్‌ను ట్రాఫిక్ అధికారులు, కాప్రా సర్కిల్ అధికారులు, స్థానిక కార్పొరేటర్‌తో కలిసి పరిశీలించారు. వ్యాటూ జోన్ నుంచి రాంగ్‌రూట్‌లో కాలనీకి వెళ్లేవారు ప్రమాదాలకు గురౌతున్నారని, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌తో స్థానికులు చెబుతున్నారు. కాలనీవాసుల కోసం యూటర్న్ ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. డీఈ బాలకృష్ణ, ట్రాఫిక్ ఎస్సై జగన్, ఏఈ కీర్తి, వినిత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులున్నారు.

త్వరలోనే రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు



తుర్కపల్లి రైల్వేగేట్ వద్ద పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

అల్వాల్: రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని రైల్వే అధికారులు వివరించారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని తుర్కపల్లి రైల్వేగేట్ వద్ద సోమవారం రైల్వే సెక్షన్ ఆఫీసర్ రవిప్రకాష్, ప్రాజెక్టు అధికారి ఉషస్‌రెడ్డి, ఇంజినీర్ నర్సింహారెడ్డి, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. ఆర్‌యూబీ నిర్మాణంతో స్థానికంగా నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. స్థల సేకరణ సమస్య లేకపోవడం వల్ల ఏడాదిలోగా పనులు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. అధికారి సుజయ్, నాయకులు డోలి రమేష్, అనీల్‌కిషోర్‌గౌడ్, శోభన్‌బాబు, ఢిల్లీ పరమేష్, దేవేందర్, జావీద్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారతీ సిమెంట్‌కు 5 స్టార్ రేటింగ్

తాపీమేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్ల అందజేత

మేడిపల్లి: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతీ సిమెంట్ భారతీ అల్ట్రాఫాస్ట్‌లో 5 స్టార్ గ్రేడ్‌ను సాధించిందని సంస్థ టెక్నికల్ మేనేజర్ సునీల్ తెలిపారు. సోమవారం మేడిపల్లిలో 150 మంది తాపీ మేస్త్రీలకు రూ.1 లక్ష చొప్పున ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోల్చితే భారతీ అల్ట్రాపాస్ట్ సిమెంట్ రూ.20 అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. డీలర్ శంకర్ రెడ్డి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కొండల్‌రెడ్డి, చీఫ్ మేనేజర్ సతీష్‌రాజ్, టెక్నికల్ ఆఫీసర్ మహమ్మద్ సహెర్, బద్రి, తాపీమేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు వచ్చేశాయ్!

- గోదాం నుంచి మండలాలకు పాఠ్య పుస్తకాల సరఫరా
- జిల్లాకు పార్టు-1 మొత్తం పాఠ్యపుస్తకాలు 5.49 లక్షలు
- బడులు ప్రారంభం రోజే విద్యార్థులకు పంపిణీకి చర్యలు

నూతన విద్యాసంవత్సరం ప్రారంభానికి 20 రోజుల ముందుగానే బడులకు పుస్తకాలను తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు జిల్లా కేంద్రంలోని గోదాంకు చేరాయి. - సాక్షి,సిటీబ్యూరో



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని రామంతాపూర్ గోదామ్ నుంచి మండల కేంద్రాలకు పుస్తకాలను సరఫరా చేస్తున్నారు. జిల్లాలో యూడైస్ ప్లస్ వివరాల ప్రకారం.. మొత్తంగా 7.72 లక్షల పాఠ్యపుస్తకాలతో సహా వర్క్‌బుక్స్ రావాల్సి ఉందని, జిల్లా విద్యాశాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి. జిల్లాకు పార్టు-1 కింద 5,49,630 పాఠ్యపుస్తకాలు అవసరమని అంచనా వేయగా.. ఇప్పటివరకు 4,63,150 పాఠ్య పుస్తకాలు జిల్లాకు వచ్చాయి. ఇంకా 86,480 పుస్తకాలు రావాల్సి ఉంది. జిల్లాలో మొత్తంగా 507 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. ఇందులో 85,465 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

రెండు భాగాలుగా అందజేత

ప్రభుత్వ, మండల పరిషత్, జెడ్పీ, ఆదర్శ పాఠశాలలు, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేస్తుంది. వీటిని పార్ట్-1, పార్టు-2లుగా విభజించి సరఫరా చేస్తారు. జిల్లాకు పార్టు-2 కింద 2,23,370 వర్క్‌బుక్స్, వర్క్‌షీట్లు, స్టూడెంట్ వర్క్‌షీట్స్ తదితర పుస్తకాలు రావాల్సి ఉండగా.. ఇవి ఆగస్టు నాటికి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పాఠ్యపుస్తకాలను మండలాల వారీగా ఎంఈవోల సమక్షంలో పంపిణీకి జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది.

20 నుంచి పాఠశాలలకు..

నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని మండల కేంద్రాల్లో ఈనెల 20న యూపీఎస్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు రెండో విడతలో భాగంగా బోధన పద్ధతులపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలోనే పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలను అందించాలని విద్యాధికారులు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. బడులు ప్రారంభమయ్యేనాటికి పంపిణీ చేసేలా చర్యలు చేపట్టారు. పుస్తకాలు పక్కదారి పట్టకుండా వాటిపై వరుస సంఖ్యలను ముద్రించారు. వీటి ఆధారంగా ఎన్ని మండలాలకు, ఏయే పాఠశాలలకు 'పుస్తకాలు అందాయన్నది' రికార్డుల్లో పక్కాగా తేలనుంది. 1-10 తరగతుల విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లో ఓ వైపు తెలుగు, మరోవైపు ఆంగ్ల మాధ్యమంలో పాఠాలను ముద్రించారు. 3-10 తరగతుల వారికి పార్టు-1, పార్టు-2 పంపిణీ చేయనున్నారు. ఈ విధానంలో విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గనుంది. పుస్తకాల్లోని ప్రతి పాఠానికి బార్ కోడ్ ముద్రించడంతో సెల్‌ఫోన్‌తో స్కాన్‌చేస్తే ఆ పాఠాన్ని వీడియో రూపంలోనూ చూసుకునే సదుపాయముంటుంది.

84 శాతం పాఠ్యపుస్తకాలు వచ్చాయి..



జిల్లాకు ఇప్పటి వరకు 84 శాతం పుస్తకాలు వచ్చాయి. మిగతావి వారం రోజుల్లో వస్తాయి. జిల్లా కేంద్రం నుంచి మండలాలకు ఎంఈవోల సమక్షంలో పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం..మిగిలిన 16 శాతం పుస్తకాలు త్వరలో వస్తాయి. బడుల ప్రారంభం రోజే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందజేయాలనుకుంటున్నాం.

- ఐ.విజయకుమారి, డీఈఓ, మేడ్చల్, మల్కాజిగిరిజిల్లా

ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి సుందరయ్య



ఘట్‌కేసర్‌లో నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఘట్‌కేసర్: పుచ్చలపల్లి సుందరయ్య అందరికి ఆదర్శ ప్రాయుడని సీపీఎం సీనియర్ నాయకుడు యాదయ్య అన్నారు. సోమవారం సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా పట్టణంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల కార్యదర్శి సబితతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాటం చేసి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేశారన్నారు. సుందరయ్య దళితులతో ఆలయ ప్రవేశాలు చేయించి సహపంక్తి భోజనాలు నిర్వహించారని, ఆయన స్ఫూర్తితో ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలు లేని సమాజం కోసం చేసే పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఎం నేతలు యాదగిరి, నాగమణి, సునిత, కిష్టమ్మ, కవిత, రుస్మాదేవి, నాగేష్, సంజన పాల్గొన్నారు.

మేడ్చల్: కమ్యూనిస్టు యోధుడు, తెలంగాణ సాయుధ పోరాటయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన చేసిన సేవలు, పోరాటాలను గుర్తు చేసుకున్నారు. మండల సీపీఎం కార్యదర్శి నరేష్, నాయకులు చంద్రశేఖర్, రవి, పూజ, రమేష్, నర్సింగ్‌రావు, కొమురయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరు సరఫరా అవుతున్నందుకు..

నల్లా బిల్లులు సగానికి తగ్గించాలి



జీఎం సునీల్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, ఎల్ఎన్‌కాలనీ, నారపల్లి, పోచారం, అన్నానగర్ వీకర్ సెక్షన్ కాలనీల్లో కలుషిత నీటి సరఫరా కారణంగా పాత బిల్లులు మాఫీ చేయాలని జలమండలి అధికారులకు మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి సోమవారం వినతిపత్రం అందజేశారు. నీటి సరఫరాలో నాణ్యత లేనందున బిల్లులను 50 శాతానికి తగ్గించాలని వినతిపత్రంలో కోరారు. జలమండలి జీఎం సునీల్ స్పందిస్తూ.. సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వివాదాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి

కుషాయిగూడ: కుషాయిగూడలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల ప్రహరీ కూల్చివేత ఘటన నేపథ్యంలో సోమవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శిశుమందిర్ పాఠశాలను సందర్శించారు. జరిగిన ఘటనపై ఆరా తీశారు. స్కూల్ ప్రిన్సిపాల్‌తో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. ఏదైనా విషయం ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని, ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఆయన పోలీసులకు సూచించారు. మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులున్నారు.

◆ ప్రహరీ కూల్చివేతపై స్కూల్ ప్రిన్సిపాల్ కొడారి రాధిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పక్కనే ఉన్న పోచమ్మ ఆలయ ప్రతినిధులతో నెలకొన్న వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకుని రెండేళ్ల క్రితం ప్రహరీని నిర్మించామన్నారు. 18న కందాడి గౌతమ్‌రెడ్డి ప్రోద్బలంతోనే దినేష్, బాల్‌రాజు అనే వ్యక్తులతో పాటు పలువురు స్కూల్‌లోకి అక్రమంగా చొరబడి ప్రహరీని కూల్చివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి సదరు వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.



విద్య అందరికీ అందాలి

పోచారం: విద్యావకాశాలు అందరికీ అందాలని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రతాపసింగారంలో వాత్సల్య డే కేర్ అండ్ ప్రీ స్కూల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలు విద్యతో పాటు ఇతర రంగాల్లోనూ రాణించాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఇష్టంగా చదువుకున్నప్పుడే పాఠ్యాంశాలపై పిల్లలు మంచి పట్టు సాధిస్తారన్నారు. మాజీ జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ మేయర్ అమర్‌సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె రాజేష్, మాజీ కార్పొరేటర్లు స్వాతికృష్ణ, అంజిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

ఉచిత అవగాహన సదస్సు

శామీర్‌పేట్: పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థులకు జఠాధరా ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత నీట్, ఐఐటీ బ్రిడ్జ్ కోర్సులపై అవగాహన సదస్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు పేర్కొన్నారు. సోమవారం మూడుచింతలపల్లి మండలం, కేశవరం గ్రామ పరిధిలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి జూనియర్ కళాశాలలో నీట్, ఐఐటీ బ్రిడ్జ్ కోర్సులపై పదోతరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులకు మూడ్రోజులపాటు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 7337285228/ 7416145227.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. లక్ష్మీనగర్, నైబర్‌హుడ్, ఏజీ సైట్, మాణిక్యరెడ్డినగర్, అపర్ణ, మైసమ్మగూడ, దూలపల్లిరోడ్డు, గుండ్లపోచంపల్లిలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

జవహర్‌నగర్: భర్త మృతిని తట్టుకోలేక ఉరేసుకుని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్‌లో నివసించే వినయ్, భార్య భవాని, కుమారుడితో కలిసి ఉంటోంది. భర్త గత 20 రోజుల క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో భార్య తీవ్ర మనోవేదనకు గురైంది. రెండ్రోజుల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లి, కుమారుడిని వదిలి తిరిగి బాలాజీనగర్‌కు వచ్చింది. భవానీ తల్లి దండ్రులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించ లేదు. వారు పక్కింటి వారిని చూడమని అడగగా.. వచ్చి తలుపు తీసి చూసేసరికి భవానీ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. వెంటనే 108కు సమాచారం అందించగా.. పరీక్షించిన సిబ్బంది అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

- డ్రైవర్ రిమాండ్

మేడ్చల్: మద్యం మత్తులో లారీ నడపుతూ.. రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టడంతో ఆ వ్యక్తి మృతి చెందాడు. మేడ్చల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు లారీ డ్రైవర్‌కు డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా.. అతడు మద్యం సేవించినట్లు తేలింది. దీంతో డ్రైవర్ నరేంద్రసింగ్ (38)ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. విచారించిన న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలి



ఏదులాబాద్‌లో కరపత్రం ఆవిష్కరిస్తున్న వ్యవసాయాధికారులు

వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్

ఘట్‌కేసర్ : రైతులు తమ పంటపొలాల్లో యూరియా వాడకాన్ని తగ్గించాలని, సేంద్రియ ఎరువులు ఉపయోగించుకుని భూసారాన్ని పెంచుకోవాలని వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. పీజేటీఎస్ఏయూ ద్వారా రూపొందించిన ఆరు అంశాలపై సోమవారం ఏదులాబాద్ రైతు వేదికలో వ్యవసాయ శాస్త్రవేత్త విజయ్‌తో కలిసి అన్నదాతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటలను చీడపీడల నుంచి రక్షించుకుని దిగుబడులు పెంచుకోవాలని, ప్రైవేటు విత్తనాలు వినియోగించకుండా వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచించిన వంగడాలను వినియోగించాలన్నారు. మేడ్చల్ ఏడీఏ వెంకటరామిరెడ్డి, మండల వ్యవసాయధికారి లావణ్య మాట్లాడుతూ.. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పకుండా రశీదు తీసుకుని భద్రపరుచుకోవాలన్నారు. అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించారు. రైతుబంధు జిల్లా సభ్యుడు మంకయ్య, మండల మాజీ కన్వీనర్ అంజిరెడ్డి, ఏఈఓలు జగదీశ్వర్, మంజుల, రైతుసేవా సహకార సంఘం డైరెక్టర్లు ఉదయ్‌కుమార్, వెంకటేష్, మాజీ డైరెక్టర్ సత్తయ్యముదిరాజ్, రైతులు ఆంజనేయులుముదిరాజ్, సాయిలు పాల్గొన్నారు.

గ్రామదేవతల జాతర

పూడూర్‌లో ఘనంగా రంగం



ప్రత్యేక పూజల్లో ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలో వారం రోజులుగా నిర్వహిస్తున్న గ్రామ దేవతల జాతర ఉత్సవాల్లో భాగంగా రంగం కార్యక్రమం జరిగింది. సోమవారం గ్రామంలోని గ్రామదేవతల ఆలయ ఆవరణలో నిర్వహించిన రంగంలో శివసత్తులు భవిష్యవాణిని వినిపించారు. గ్రామానికి చెందిన వందలమంది భక్తులు రంగం కార్యక్రమానికి హాజరయ్యారు. గ్రామదేవతల జాతరలో పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని పూజల్లో భాగస్వామ్యం అయ్యారు. ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్ తదితర నేతలు పాల్గొన్నారు. పూడూర్ మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, బాబుయాదవ్, పోచయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.



రంగంలో భవిష్యవాణి వింటున్న గ్రామస్తులు

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



పూడూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని పూడూర్ రైతు సేవా సహకార సంఘంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి మండల కాంగ్రెస్ నేతలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు సంఘం అధికారులతో సమావేశం నిర్వహించి రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దన్నారు. రైతులకు అనవసర ఇబ్బందులు కలిగించొద్దని, అవసరమైన గోనె సంచులు అందుబాటులో ఉంచాలని కోరారు. సంఘం చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఏఈఓ తేజస్విని, కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, వరదారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, రాజు, మహేష్, రాహుల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

పోచారం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం అన్నోజిగూడలోని వికలాంగుల కాలనీలో నిర్వహించిన సీపీఐ ఘట్‌కేసర్ మండల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సంఘాలను బలోపేతం చేస్తూ.. ప్రజా సమస్యలపై ఉద్యమించాలన్నారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శిగా ఈశ్వర్, సహాయ కార్యదర్శిగా సయ్యద్ ఖదీర్, మరో 16 మంది మండల కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లొట్టి ఈశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శంకర్‌రావు, కల్లూరు జయచంద్ర, అన్వర్ పాషా, కిష్టయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు షీల్డ్ అందజేస్తున్న నాగవిహారి

ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్ క్రీడామైదానంలో నిర్వాహకుడు నందం నాగవిహారి ఎలైట్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఫుట్‌బాల్ టోర్నీని నిర్వహించారు. టోర్నీ విజేత, రన్నరప్ జట్టుకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నాగవిహారి మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థుల సమయం వృథా కాకుండా ఉండాలని, సొంత డబ్బుతో మైదానం శుభ్రం చేసి టోర్నీని నిర్వహించానన్నారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంచేందుకే ఈ టోర్నీ నిర్వహించామని, ప్రోత్సాహకంగా బహుమతులు అందజేశామని వివరించారు. భవిషత్తులో ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగి ఘట్‌కేసర్‌కు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. జింకిసింగ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



సాయి వెంకటకృష్ణ (ఫైల్)

ఘట్‌కేసర్: పనికోసం బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌కు చెందిన సాయి వెంకటకృష్ణ (34), జ్యోతికి 8 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈనెల 15న ఉదయం పనికోసం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం బంధువులు, తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో భార్య జ్యోతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గత కొంత కాలంగా భార్యాభర్తలు గొడవ పడుతున్నట్లు సమాచారం. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరోచోట బాలిక..

పోచారం: ఓ బాలిక అదృశ్యమైన ఘటన పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌గఢ్‌కు చెందిన దుగేష్ కశ్యప్ తన తల్లిదండ్రులు, ముగ్గురు సోదరిలతో కలిసి ఉపాధికోసం అన్నోజిగూడకు వచ్చారు. కూలిపనులు చేసుకుంటూ.. జీవనం సాగిస్తున్నారు. ఈనెల 14 నుంచి తన సోదరి (15) కనిపించకపోవడంతో చత్తీస్‌గఢ్‌కు వెళ్లిందని మొదట భావించారు. ఆమె అక్కడకు రాలేదని తెలుసుకుని, ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా లభించకపోవడంతో సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.